**భ**క్తిపారవశ్యంతో ఆగకుండా నామసంకీర్తన చేసే భక్తుడిలా ఎడతెరిపిలేకుండా దగ్గుతున్నాడు జగన్నాథం. అది వింటూ నాస్తికుడిలా చిరాకుపడిపోతోంది జలజ.

ఆ చిరాకు తండ్రి మీద కాదు – తన పరిస్థితుల మీద!

ఎదుగూ బొదుగూ లేని రాష్ట్ర ప్రభుత్వోద్యోగం చేస్తున్న జగన్నాథానికి బ్రతుకు భారం తగ్గించడానికన్నట్లు నాలుగు సంవత్సరాల క్రితం భార్య పోయింది. అయినా ఆయనకు ఎదిగిన కూతురు గుండెల మీద కుంపటిలా వుంది. ఆ ప్రభావం వల్ల అప్పుడప్పుడు శరీరం వెచ్చబడి జబ్బు చేస్తూంటుంది. ఈసారి శరీరం వెచ్చబడలేదు కానీ జబ్బు చేసింది. గవర్నమెంటు డాక్టరు మెడికల్ లీవూ, బెడ్ రెస్టూ, మంచి ఆహారం సజెస్టు చేశాడు. మొదటి రెండూ దొరికాయి. మూడోది కష్టంగానే వుంది.

జలజను చూడగానే అందమైన అమ్మాయి అని చెప్పడానికి మూగవాడికి మాటలొస్తాయి. ఆమె చూపులు వయసు ప్రభావం వల్ల యువకుల హృదయాలను తూపులై గాయపర్చవచ్చునేమోకానీ – విసిరేవి మాత్రం మృదువుగా తాకే పూలబాణాలే! ఆమె సమక్షం రసికుల తనువును వేడెక్కించవచ్చునేమో కానీ – ప్రసరించేది మాత్రం చల్లని వెన్నెలనే!

ఆమెను చూస్తే సామాన్యులు కవులౌతారు. కవులు మూగబోతారు. ఆమె అందం అసామాన్యమన్నది నిర్వివాదాంశం.

అందం కొందరికి వరం. కొందరికి శాపం.

కొందరు శాపాలను వరాలుగా మార్చుకుంటారు. కొందరు వరాలను శాపాలుగా మార్చుకుంటారు.

జగన్నాథం ఉద్యోగం కల్పవృక్షమని ఎందరో అంటారు. అది వరమని ఎందరో ఋజువు కూడా చేశారు. కానీ నీతి, నిజాయితీలను గుడ్డిగా నమ్మినందువల్ల ఆ ఉద్యోగం జగన్నాథానికి శాపమై శత్రువుల్ని పెంచింది.

తండ్రి నమ్మిన నీతి, నిజాయితీ, శీలం, సంప్రదాయం జలజకు అందాన్ని శాపం చేశాయి.

ఇప్పుడు జగన్నాథం దగ్గులోంచి జలజకు మృత్యుంజయ్ మాటలు వినబడుతున్నాయి.

మృత్యుంజయ్ డాక్టరు. గవర్నమెంటు డాక్టరు జగన్నాథాన్ని సంప్రదించమన్న స్పెషలిస్టు మృత్యుంజయ్. ఆయన కూతురితో కలిసి వెళ్ళినప్పుడు మృత్యుంజయ్ జలజ ముందే ఆయన్ని పరీక్షించేక ఏకాంతంలో ఆమెతో మాట్లాడాలన్నాడు.

తండ్రి జబ్బు ప్రమాదకరమైనదని చెబుతాడని భయపడింది జలజ. అయితే ఆమె ఊహకందనంత భయంకరమైన మాటలు చెప్పాడు మృత్యుంజయ్.

ముందుగా అతడు జగన్నాథం జబ్బు ప్రమాదకరమైనది కాదనీ – పుష్టికరమైన ఆహారం తీసుకుంటే మూడు నెలల్లోనూ, లేకున్నా ఏడాదిలోనూ తగ్గిపోతుందనీ అన్నాడు. మార్కెట్లోకి కొత్తగా వచ్చిన మందులు కొన్ని వాడితే వారం రోజుల్లో ఆయన నవయువకుడిలా లేచి తిరగగలడన్నాడు. అయితే అందుకు చాలా ఖర్చవుతుందిట.



ఇది తుపాను ముందరి ప్రశాంతత.

అప్పుడు చెప్పాడతడు – జగన్నాథం వైద్యానికీ, కోలుకోడానికీ అయ్యే మొత్తం ఖర్చంతా తనే భరిస్తానని.

అది తుపాను ముందర చల్లని గాలిలా నెమ్మదిగా తగిలిందామెకు.

జలజ మృత్యుంజయ్ కెంతగా నచ్చిందంటే తొలి చూపులోనే అతడు ఆమె లేక సర్వం కోల్పోయిన అనుభూతిని చెందుతున్నాడు.

ఇలాంటి మాటలు ఇంటర్మీడియెట్లో ఇద్దరు క్లాస్‌మేట్లు చెప్పగా విందామె. వాళ్ళు కుర్రాళ్ళు. ఆమె ఈడువాళ్ళు. డాక్టర్ మృత్యుంజయ్ యువకుడు. ఆమెకీడైనవాడు.

"ఇది మా నాన్నతో మాట్లాడండి. నాన్నకు కులం పట్టింపు వుంది. మీ కులమేమిటో నాకు తెలియదు" అంది జలజ.

ఆమె మాటలకు ఒక్క ముక్కలో జవాబిస్తూ, "నాకు పెళ్ళయింది" అన్నాడు మృత్యుంజయ్. అప్పటికి ఉరుముల శబ్దం జలజకు వినబడింది.

అంతవరకూ డాక్టర్లో హుందాతనాన్నీ, మంచితనాన్నీ, గొప్పదనాన్నీ ఊహిస్తున్న జలజకు అలాంటి అనుభవమే తనకిచ్చిన నలుగుర్ని గుర్తుకుతెచ్చాయి. ఒకడు స్కూల్లో టీచరు. ఒకడు టైపు ఇన్‌స్టిట్యూట్ భాగస్వామి. ఒకడు బంధువు. ఒకడుద్యోగం ఇవ్వగల శ్రేయోభిలాషి. తమకు పెళ్ళిళ్ళైనట్లు వాళ్ళు చెప్పలేదు. ముందే ఆమెకు తెలుసు. ఆమె అవసరాన్ని కనిపెట్టి తమ సరదా తీర్చుకోవాలని వాళ్ళనుకున్నారు.

ఇప్పుడు డాక్టర్ మృత్యుంజయ్!

జలజకు ఏమనాలో తెలియలేదు. అవమానం ఆమెను కమ్ముకున్న మాట నిజం. కానీ వెంటనే ఆమె అక్కణ్ణించి విసురుగా వెళ్ళిపోలేదు. పేదవాడి కోపం పెదవికి చేటు – అని అనుభవం ఆమెకు చెప్పింది. అందువల్ల తన గురించీ, తన పద్ధతి గురించీ, తను నమ్మిన సంప్రదాయం గురించీ అతడికెలా చెప్పాలో తెలియక సతమతమవుతోంది.

బహుశా మృత్యుంజయ్‌కు అన్నీ తెలుసు. నెమ్మదిగా, "సమస్త జీవులకూ శక్తినిచ్చే సూర్యుడు, ప్రాణుల రోగ నివారణకై అశ్వినీదేవతలను కూడా సృష్టించాడు. ప్రజలు వైద్యుణ్ణి సూర్యభగవానుడిలా భావించాలి. ఆయనకూ పెళ్ళయినా, పిల్లలున్నా కుంతీ కుమారిని మోహించాడు. నేనూ అంతే! డాక్టర్ని కదా – నీ కన్యాత్వం భంగం కాకుండా నా కోరిక తీర్చుకోగలను. నువ్వు అనుమతించాలి. అంతే!" అన్నాడు.

తుపాను ప్రారంభమయింది. ఆ గాలి విసురుకు ఆకులాంటి జలజ అక్కడ ఆగలేకపోయింది. తండ్రి ఆరోగ్యాన్ని సూర్యభగవానుడి దయకు విడిచిపెట్టింది.

ఇది జరిగి వారం రోజులయింది. అయినా తండ్రి దగ్గులోంచి ఆమెకు "నీ కన్యాత్వం భంగం కాకుండా నా కోరిక తీర్చుకోగలను. నువ్వు అనుమతించాలి. అంతే!" అన్న డాక్టరు మాటలు ఇప్పటికే పదే పదే వినపడుతున్నాయి. ఆమె వినాలన్నట్లుగా తండ్రి కూడా పదే పదే దగ్గుతున్నాడు.




తల్లి పోయినప్పట్నించీ జలజకు తానే తల్లీ తండ్రీ అయి కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు జగన్నాథం. తననంతగా అభిమానించే తండ్రి మనసుకు కష్టం కలగకూడదని ఆమె తాపత్రయం. లేకుంటే ఆమె మరీ అంతగా సంప్రదాయాన్ని నమ్మే మనిషి కాదు.

ఎక్కువ మంది తమ అవకాశాన్ని బట్టీ, వీలునుబట్టీ తోచింది చేస్తారు. కొందరు డబ్బు, అధికారం ఉపయోగించి తమను తాము సమర్థించుకుంటారు. కొందరు బలంతో తమను తాము సమర్థించుకుంటారు. కొందరు తర్కంతో! అది ఆత్మవంచన అనుకుందుకు లేదు. కలియుగంలో మనుషులకు ఆత్మ వుండడం అరుదు. ఉన్నవారు జగన్నాథంలా వుంటారు.

జగన్నాథం జగన్నాథంలా వుండకపోతే అటు ఆయన సమస్యలూ, ఇటు జలజ సమస్యలూ ఒకే దెబ్బతో పరిష్కరించడానికి ప్రదీప్ వున్నాడు.

ప్రదీప్ భాగ్యవంతుల బిడ్డ. స్వంత కారుంది. ఇంచుమించు సినిమా హీరోలా వుంటాడు. ఒకసారి అతడు జలజకు తన కార్లో లిఫ్టిచ్చాడు. ఆమె గురించి తెలుసుకుని తన గురించి చెప్తున్నాడు. ఆమెను పెళ్ళి చేసుకుంటానన్నాడు. అయితే ఒకరినొకరు అవగాహన చేసుకుందుకు కొన్నాళ్ళు చనువుగా కలిసి తిరగాలన్నాడు. ఆ సమయంలో ఆమె మనసు ప్రశాంతంగా వుండడానికామెను అన్నివిధాలా ఆదుకుంటానన్నాడు.

కొన్నాళ్ళపాటు ప్రదీప్‌ని బాయ్‌ఫ్రెండ్‌గా అంగీకరించగలిగితే జగన్నాథం చక్కటి వైద్యాన్ని పొందగలడు. జలజకు మంచి ఉద్యోగం దొరకగలదు.

ఆదిలోనే జలజ ఈ పరిచయాన్ని త్రుంచేసింది. వాళ్ళకు కులాలు కలవవు. జగన్నాథం ఈ పెళ్ళికి ఒప్పుకోడు. పెళ్ళి సాధ్యం కానప్పుడు అవగాహన అవసరం లేదు.

జలజలోని నీతి నచ్చకపోయినా నిజాయితీ ప్రదీప్‌కి నచ్చింది. అతడామెను వేధించదల్చుకోలేదు. కానీ విడిచిపెట్టనూ లేదు. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఆమెను కలుసుకుని పలకరిస్తుంటాడు. ఆ పలకరింపు చూసే వాళ్ళలో ఎలాంటి సంకోచాన్నీ పుట్టించదు. ఆమె కెటువంటి ఇబ్బందినీ కలిగించదు.

జలజ తనను మరిచిపోకూడదని ప్రదీప్ తాపత్రయం. ఏదైనా బలహీన క్షణంలో, తప్పనిసరి పరిస్థితుల్లో – ఆమె తన వద్దకు వచ్చే అవకాశమున్నదని అతడి ఆశ! అలాంటి ఆశ ఇచ్చిన ఓర్పుతోనే అడవిలో క్రూరజంతువులు వేటాడగల్గుతున్నాయి.

డాక్టర్ మృత్యుంజయ్ మాటలు విన్నాక జలజకు ప్రదీప్ సంస్కారం చాలా గొప్పదనిపించింది. ఆమె ఆలోచనల్లోకి తరచుగా వస్తున్నాడు ప్రదీప్. అది

ప్రేమ అనడం కష్టం కానీ అతడి కామె పట్ల కొంత యిష్టమేర్పడింది.

ఆ రోజు కూడా జగన్నాథం దగ్గుతున్నాడు. ఆ సమయంలో పోస్టుమన్ వచ్చి జలజకో ఉత్తరమిచ్చి వెళ్ళాడు.

జలజ ఆ ఉత్తరం చదివింది.

బావ నుంచి వచ్చిందా ఉత్తరం.

బావ పేరు త్రిమూర్తి. జలజ పుట్టినప్పుడతడికి పెళ్ళాం పుట్టిందని అన్నారంతా! చిన్నప్పట్నించీ వాళ్ళు పరస్పరం ఇష్టపడేవారు. అతడికి ఐఐటీలో ఇంజనీరింగు సీటు వచ్చేక మేనమామ ధోరణి మారింది. కట్నం గురించి తరచుగా మాట్లాడేవాడు. జగన్నాథం ఆశలు వదిలేశాడు.

త్రిమూర్తి ఉద్యోగంలో చేరి ఏడాదయింది. జలజ అప్పుడు గ్రీటింగ్స్ కూడా పంపింది. అతడు జలజకు ఉత్తరాలు వ్రాస్తూంటాడు. అవి పొడిపొడిగా వుంటాయి. ఎక్కడా పెళ్ళి ప్రసక్తి వుండదు. ప్రేమ వుండదు.

ఈసారీ అలాంటి ఉత్తరమే అనుకుంది జలజ. కానీ అందులో పెళ్ళి ప్రసక్తి వుంది. త్రిమూర్తికి జలజను పెళ్ళిచేసుకోవాలని వుంది. తండ్రి ఒప్పుకోవడం లేదు. ఇప్పుడతడికి అమెరికా అవకాశం వచ్చింది. కొడుకుని అమెరికాకు బ్రహ్మచారిగా పంపడం తండ్రికిష్టంలేదు. తొందరగా మంచి సంబంధం దొరకడం కష్టమనేకాక కొడుకుని పరాయి పిల్లతో అమెరికా పంపడం కూడా ఆయనకిష్టంలేదు. అయితే అమెరికా వెళ్ళడానికి దారి ఖర్చులైనా భరించాలి జగన్నాథం అని ఆయన పట్టుదల.

"నేను అమెరికా వెళ్ళేక మన ఆర్థిక పరిస్థితే మారిపోతుంది. నాన్న దగ్గర కూడా ఇప్పుడు డబ్బు లేదు. ఎలాగో అలా పాతిక వేలు కట్నంగా సిద్ధం చేయమను. అందుకు అప్పయితే ఏడాదిలోగా మనం తీర్చేయగలం... ఇందుకొప్పుకుంటే మన పెళ్ళి జరుగుతుంది" అన్నదా ఉత్తరంలోని సారాంశం.

ఆ ఉత్తరమేమిటని జలజను జగన్నాథం అడగలేదు. అదెక్కణ్ణించి వచ్చిందో జలజ ఆయనకు చెప్పింది. అందులో ఏమైనా వుంటే ఆమె తనకు చెబుతుందని ఆయనకు తెలుసు. ఏముందో ఆమె చెప్పలేదు కాబట్టి ఎప్పటిలాగే అందులో ఏమీ వుండివుండదని ఆయన అనుకున్నాడు.

తమ పరిస్థితి పూర్తిగా తెలిసికూడా త్రిమూర్తి అలా ఉత్తరం వ్రాశాడని కాక తమ పరిస్థితులకు మాత్రమే బాధపడింది జలజ. అప్రయత్నంగానే ఆమెకు కళ్ళనీళ్ళొచ్చాయి.

తండ్రి ఆరోగ్యం బాగుపడాలంటే తనకు పెళ్ళి కావాలి. తనకు పెళ్ళి కావాలంటే డబ్బు కావాలి. తమకు సెంటు భూమి లేదు. స్వంత యిల్లు లేదు. తండ్రి ప్రావిడెంటు ఫండులో కొద్దిగా డబ్బుంది. అది ఇన్నేళ్ళ తండ్రి సంపాదన. అదంతా కలిపినా త్రిమూర్తికి సరిపోదిప్పుడు. ఆ తర్వాత ఆయనెలా బ్రతుకుతాడు?

దరిదాపుల్లో తన జీవితానికి మోక్షం కనపడ్డం లేదు. ఇలాంటి బ్రతుకీడ్వడం కంటె చావు మేలు... చావు తన సమస్యలనే కాదు... తండ్రి సమస్యలను కూడా దూరం చేస్తుంది.

త్రిమూర్తి ఉత్తరం చూసేదాకా జలజ బ్రతుకు గురించే ఆలోచించింది. ఇప్పుడామె దృష్టి చావు మీదకు మళ్ళింది. ఒకసారి చావు గురించి స్ఫురించగానే ఆమెలో చావాలన్న కోరిక బలపడసాగింది. అప్పుడామెకు ఏదో పుస్తకంలో, "చావాలనుకున్నవాడు వెంటనే చావాలి. బ్రతుకు తీపి ఎలాంటిదంటే కాళ్ళూ చేతులూ కళ్ళూ చెవులూ లేని వాడు తన అవకరాల గురించి కాక బ్రతుకు గురించే ఆలోచిస్తాడు. చావును వాయిదా వేస్తే ఆ మనోబలం మళ్ళీ రాదు" అన్న వాక్యాలు గుర్తుకొచ్చాయి.

జలజ వాయిదా వేయకూడదనే అనుకుంది.

మధ్యాహ్నం ఆమె యిచ్చిన మందు వేసుకుని నిద్రపోతున్న తండ్రిని తనివితీరా చూసుకుని, "జీవితంలో నాకు మిగిలిన, తెలిసిన ఏకైక వ్యక్తిని శాశ్వతంగా విడిచిపోతున్నాను. నాతోపాటు నా తండ్రి సమస్యలు కూడా శాశ్వతంగా పోతాయి" అనుకుంది.

ఆయన సాయంత్రం దాకా లేవడు.

జలజ యింటికి తాళం వేసుకుని బయల్దేరింది. జగన్నాథం వద్ద మారు తాళముంది. అవసరమనుకుంటే ఆయన దొడ్డిదారిలో తిరిగొచ్చి యింటి తాళం తీయవచ్చు. ఇది వారిద్దరికీ మామూలే!

వాళ్ళింటికి కిలోమీటరు దూరంలో కొండ ఒకటి వుంది. దాన్నానుకుని నది ఒకటి ప్రవహిస్తోంది. కొండ మీంచి నదిలో దూకితే ప్రాణాలు పోవడానికెంతోసేపు పట్టదు. అక్కడ మొసళ్ళెక్కువని చెప్పుకుంటారు.

జలజ బయల్దేరింది. దారిలో పోస్టాఫీసు వద్ద ఆగి ఓ ఇన్‌లాండ్ కొని తను చావాలని ఎందుకనుకుందో, ఏ విధంగా చావబోతోందో ఉత్తరం రాసింది. అడ్రసు తన పేరునే వ్రాసి ఉత్తరాన్ని పోస్టుబాక్సులో వేసింది.

జలజ కొండను చేరుకుని పైకి ఎక్కడానికెంతోసేపు పట్టలేదు. మనసును చిక్కబట్టుకునేందుకామె కాసేపు కూర్చుంది.

పైన నీలాకాశం, చుట్టూ పచ్చదనం...

ప్రకృతి టెక్నికలర్లో రమణీయంగా వుంది. తన్ను తాను ఆ ప్రకృతి నుంచి కావాలని దూరం చేస్తున్నానని జలజకు మనసు చివుక్కుమంది. ఇక అంతరాత్మ తనలోంచి బయటకు వచ్చి హెచ్చరికలు ప్రారంభిస్తుందని ఆమె భయపడి చటుక్కున లేచి నిలబడింది.

"జలజా!" అన్న పిలుపామెకప్పుడు వినిపించింది.

అది పురుష కంఠం కాకపోతే – అంతరాత్మ పిలుపేమోనని భ్రమపడేదామె. వెనక్కు తిరిగి చూస్తే ప్రదీప్.

జలజ పరుగెత్తాలనుకుంది. ప్రదీప్ పరుగున వచ్చి ఆమెకు అడ్డంగా నిలబడ్డాడు. ఆమె నిలువునా కూలబడితే తనూ ఆమె ముందు చతికిలబడ్డాడు.

ముందుకాసేపేడ్చింది జలజ. తర్వాత అన్నీ చెప్పింది. ఆ తర్వాత అతడి ముందు తన స్థితికి సిగ్గుపడింది.

"నువ్వు పోతే నీ తండ్రి సమస్యలు పరిష్కారం కావు. నీ శీలంపై అపవాదులు వేసి లోకులు కాకులై పొడుస్తూంటే ఆ అవమానంతో కుమిలి కుమిలి కృంగి కృశించి ఒక రోజున తనూ ఆత్మహత్య చేసుకుంటాడాయన. నీ కోసం, నీ ఆసరాతో బ్రతుకుతున్న ఆయనకు నువ్వే ఇలా అన్యాయం చేయడం ఘోరాతి ఘోరం –" అన్నాడు ప్రదీప్ మొదట.

"నా ప్రేమ నీకు తెలియ లేదు. కులం పేరుతో మన పెళ్ళి సాగదన్నావు. పెళ్ళి కాకపోతే ప్రేమ చస్తుందనుకున్నావా? నీ తండ్రి వైద్యానికి, నీ పెళ్ళి

## చలోక్తులు

ఒకరోజు ముళ్ళపూడి వెంకట రమణగారి దగ్గరకు ఒక వ్యక్తి వచ్చాడు. ఇద్దరూ మాట్లాడుకుంటుండగా మాటల సందర్భంలో ఆ వ్యక్తి "మద్రాసులో ఎక్కువగా అరవవాళ్ళేకదా వుంటారు. మరి ఇక్కడ వుండే తెలుగు వాళ్ళని ఎలా పోల్చుకోవడం?" అని అడిగాడు.

దానికి ముళ్ళపూడి "మీరు పేపరు కొని చదువుతుంటే,మధ్యలో ఆ పేపర్ని, ఎవరు అడిగి తీసుకుంటారో వాడే తెలుగువాడు!" అన్నారు తక్కున.



కట్నానికి డబ్బు నేనిస్తాను. డబ్బుతో ముడివడి వున్న నీ సమస్యల్ని నేను పరిష్కరిస్తాను" అన్నాడు తర్వాత.

"నువ్వు నమ్మిన నీతి నిన్ను చావు వైపు తరిమింది. నీ తండ్రి నమ్మిన సంప్రదాయం నిన్నాయనకు దూరం చేసింది. వాటినిక మర్చిపో. నీ సమస్యల నుంచి తప్పించుకోలేక ఈ ప్రపంచాన్నే విడిచిపెట్టాలనుకున్న నిన్ను నేను రక్షించుకున్నాను. ఇక నీవు నా దానివి. కాదనకూడదు" అన్నాడు ఆ తర్వాత.

"నీకు నన్ను పెళ్ళి చేసుకోవాలని అంత పట్టుదలగా వుంటే – ఇద్దరం కలిసి మృత్యువునాహ్వానిద్దాం. మరో లోకమంటూ వుంటే నీ కోరిక తీరుతుంది. నా సమస్య పరిష్కారమవుతుంది. నేను బ్రతికుండగా మన పెళ్ళి జరుగదు. నాన్న మనసు నొప్పించను" అంది జలజ తేరుకున్నాక.

"నీకు తండ్రి మీద అంత ప్రేమ వుంటే ముందాయన్ను బ్రతికించుకో. నాతో రా – నీకు డబ్బిస్తాను" అన్నాడు ప్రదీప్.

ఇద్దరూ అక్కణ్ణించి ఒక యింటికి వెళ్ళారు. ఆ యిల్లు కొండకు దగ్గర్లోనే వుంది. చూడ్డానికి బయటకు సింపుల్‌గా వున్నా లోపల విలాస మందిరంలా వుంది.

అక్కడ ప్రదీప్ సంప్రదాయంలోని మూర్ఖత్వాన్నీ, స్త్రీ జాతిలో చైతన్యం రావలసిన అవసరాన్నీ ఆమెకు వివరించాడు. ఆమెను తానెంతగా ప్రేమిస్తున్నాడో చెప్పకున్నాడు. నెమ్మదిగా దగ్గరగా తీసుకున్నాడు.

జలజ మృదువుగానే అతడిని విడిపించుకుని, "నాకు డబ్బు కావాలి!" అంది. అతడు తిరిగి ఆమెను పట్టుకుని, "నాకు నువ్వు కావాలి" అన్నాడు.

"ఇది మోసం!" అందామె.

"నేను మోసగించినా అది నీ కోసమే! ఒకసారి నాకు లొంగేక నాతో పెళ్ళిని కాదనలేవు. అవునా?" అన్నాడు ప్రదీప్.

జలజ ప్రతిఘటించింది. అతడి బలం ముందామె బలం చాలడంలేదు. శారీరకంగానే కాదు, మానసికంగా కూడా!

అంతవరకూ ఏ మగాడూ ఆమెతో అలా చొరవ చేయలేదు. ఆమె మనసులో కలవరపాటు మొదలయింది. పవిత్రత అంటే ఇంతేనా? ముందడుగు వేస్తున్న మగాడిని తను మనస్ఫూర్తిగా ఆపలేకపోతోందంటే అందుకు కారణం తన వయసా, పరిస్థితులా లేక తన బుద్ధి మంచిదికాదా?

ప్రదీప్‌నీ ప్రేమనీ కలిపి అంతవరకూ ఆమె ఆలోచించలేదు. ఇంటి పరిస్థితుల కారణంగానేమో ప్రేమకు సంబంధించి ఒక రకమైన జడత్వమామెనావహించి వుంది. ఇప్పడామెలో చైతన్యం కలిగింది. తాత్కాలికంగానైనా ఆమె ప్రదీప్‌ని కోరుతోంది.

అతడికి లోకువ కాకూడదని ఎదిరిస్తున్నా ఓడిపోవాలని ఆమె మనసు మరీ మరీ అంటోంది. కేవలం అహాన్ని తృప్తి పర్చుకుందుకు ఆమె ప్రతిఘటిస్తోంది.

నెగ్గడానికి మూడువందల పరుగులు కావాలి. ఇంకా పది గంటల ఆట మిగిలివుంది. తొమ్మిది వికెట్లు పడిపోయాయి. అప్పడా ఆఖరి బ్యాట్స్‌మెన్ మనఃస్థితి ఎలా వుంటుంది.

జలజ పరిస్థితి అలాగే వుంది.

"మృత్యువు తీర్పని నీ సమస్యలు నా వల్ల తీరతాయి. నీ తండ్రి కోలుకుంటాడు. ఆయనకు నేను నచ్చకపోతే నీ బావతో పెళ్ళికి కట్నం డబ్బులూ నేనే ఇస్తాను. నాకు సహకరించు. మృత్యువునుంచి తప్పించుకున్నా నానుంచి తప్పించుకోవడం ఎలాగూ నీకు సాధ్యం కాదు" అన్నాడు ప్రదీప్.

క్రమంగా జలజలోని ప్రతిఘటన కూడా బలహీనపడింది.



అప్పుడు...

వారున్న గదిలోనికి సుడిగాలిలా ప్రవేశించిందో యువతి.

ఉలిక్కిపడింది ప్రదీప్, జలజల జంట... విడిపోయింది...

తన శీలం చెడిందో, చెడుతోందో తెలియని స్థితి జలజకు. అయినా ఆమె ఆ యువతిని ఆశ్చర్యంగా చూసింది.

ఆమె జలజకంటే అందంగా వుంది. ఆమె చేతిలో కత్తి వుంది. ఆ కత్తివల్ల ఆమెకు దుర్గామాత పోలికలు వచ్చాయి.

"చంద్రికా!" అన్నాడు ప్రదీప్ కంగారుగా.

"ఇక్కడే నువ్వు నన్ను మోసం చేశావు. మోజు తీరగానే నన్ను చీదరించావు. కొంప మునిగిందేం లేదు – మోసగాడిని మరిచిపోవడమే మంచిదనుకున్నాను. కానీ మన గతాన్ని బయటపెట్టి నా పెళ్ళి చెడగొడతావని నేననుకోలేదు. నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవు. నువ్వొప్పుకునేదాకా నాకు పెళ్ళి కాకూడదు. ఇదే కదా నీ పథకం. అయినా అంతా నీవంటివారే వుండరుగా! నా కథ తెలిసి కూడా నన్ను పెళ్ళి చేసుకుందుకు ముందుకొచ్చాడో మగాడు. నిన్ను మర్చిపోవాలనే అనుకున్నాను. కానీ నిన్ననే నా ప్రాణానికి ప్రాణమైన స్నేహితురాలు ఆత్మహత్య చేసుకుంది. అది నిన్ను నమ్మినంతగానూ పవిత్రతనూ నమ్ముతుందనీ నాకు నిన్ననే తెలిసింది. తల్లిదండ్రులకు రాసిన ఉత్తరంలో నీ గురించి వ్రాయలేదు. నా కోసం వేరే ఉత్తరం ఏర్పాటుచేసింది. నువ్వు మోసం చేశావని తెలిసీ తెలియగానే అది బేగాన్ స్ప్రే తాగేసింది. నాకిప్పుడు జీవితం మీద మోజు పోయింది. నాలో నీకు అనుకూలంగా చైతన్యం పుట్టించాలని స్త్రీ జాతి చైతన్యం గురించి చాలాసార్లు చెప్పావు. నాలో చైతన్యం నీ కారణంగానే వచ్చింది! నిన్ను బ్రతకనివ్వను..." అందామె.

ప్రదీప్ లేచి నిలబడ్డాడు.

"కళ్ళు మూసుకుని దైవప్రార్థన చేసుకో!" అందామె.

ప్రదీప్ నవ్వాడు, "ఆవేశంలో నీకు వళ్ళు తెలియడంలేదు. ఎవరెవరి తప్పులో నాకు అంటగడుతున్నావు. ఇలా దగ్గరగా రా! నీ ఆవేశం తగ్గించి సముదాయించి అన్నీ వివరంగా చెబుతాను."

అతడి మాటలామెలో ఆవేశాన్ని పెంచాయి. ఆమె అతడిని సమీపించింది. ప్రదీప్ చటుక్కున ఒడుపుగా కత్తి వున్న ఆమె చేతిని పట్టుకున్నాడు. ఆమె పెనుగులాడుతూ, "చెల్లాయ్! ఈ దుష్టుడు నిన్ను మోసం చేస్తున్నాడు. వీడిని అంతం చేయడం స్త్రీ జాతి విధి. నాకు సహకరించు" అంది.

"చెల్లాయ్" అన్న పదం గాలిలో తేలుతూ మృదువుగా తాకింది జలజను. ఆ పదంలోని ఆప్యాయత జలజ తనువులోని ఆవేశాన్ని పూర్తిగా మాయం చేసింది.

జలజకు తల్లి పోయాక అంత ఆప్యాయమైన పిలుపందించిన ఆడవాళ్ళు లేరు. శంఖులో పోసినప్పుడే తీర్థమవుతుందన్నట్లు ఆడవారినుంచి మాత్రమే ఆప్యాయత, ఆత్మీయత సార్థకమవుతాయి.


తానేమి చేయాలనుకుంటోందో జలజకు తెలియదుకానీ ఆమె లేచి నిలబడింది. ఆమె ఏదో చేసేలోగానే కెవ్వుమన్న ఆర్తనాదం ఆ చుట్టుపక్కల వాతావరణాన్ని నింపేసింది.

జలజ కూడా తనకెదురు తిరిగే అవకాశముందనుకున్నాడో ఏమో ప్రదీప్ త్వరపడ్డాడు. చంద్రిక చేతిలోని కత్తి అతడి బలంతో ఆమె హృదయంలో బలంగా దిగబడిపోయింది. అతడామెను వదలగానే కుప్పలా కూలిపోయింది. నేల కూలేక మరోసారి, "చెల్లాయ్, వీణ్ణి వదలకు" అంది. ఆమె ప్రాణాలు అనంతవాయువులో కలిసిపోయాయి.

హత్య!

జలజ కళ్ళముందో హత్య జరిగింది.

ఒక్కసారిగా ఆమె తనువు వణికింది. వెనక్కు తిరిగిన ప్రదీప్ బట్టల




నిండా రక్తం చూసి ఆమె కెవ్వుమంది.

"ఆత్మరక్షణ కోసం తప్పనిసరి అయింది. అనుకోకుండా జరిగిందిది. కావాలని నేనేం చేయలేదు. నువ్వు భయపడకు. నిన్నేం చేయను. నాకు సాయం చెయ్" అన్నాడు ప్రదీప్.

శవాన్ని చాపలో చుట్టి అక్కడకు దూరంగా చేర్చడంలో జలజ అతడికి సాయపడింది. ప్రదీప్ తన వంటిమీది దుస్తులు మార్చి ఆమెకిచ్చి, "వీటిని నీ ఇంట్లో అంటించి మసి చేసెయ్" అన్నాడు.

ఆ దుస్తులు జలజకు కొండచిలువల్లా తోచాయి, "వీటిని ఇక్కడే ఏదైనా చేయి – ఇంటికి తీసుకుని వెళ్ళడం నావల్లకాదు" అందామె.

ప్రదీప్ ఆమెకు వందరూపాయల కట్ట ఒకటిచ్చాడు.

"నువ్వు నాదానివయ్యావు. నువ్విష్టపడితే మన పెళ్ళి జరుగుతుంది. ఇక్కడ జరిగిందంతా మరిచిపో. ఇక్కడి విషయం ఎక్కడ చెప్పినా మన సంబంధం బైటపడడం నిశ్చయం. అది విని నీ తండ్రి భరించలేడు. గుర్తుంచుకో!" అని నవ్వి, "ఇక్కడ ఈ దుస్తుల్ని నాశనం చేయడం ప్రమాదం. అది నీ ఇంట్లో జరిగితేనే సేఫ్" అన్నాడు.

అతడిలో తొలిసారి హత్యచేసిన కలవరం, అనుభూతి లేవు. అతడి గురించి ఆలోచిస్తూనే ఆమె ఆ ఇంట్లో రక్తపు మరకలు తుడిచింది. అతడు కోరిన సాయం చేసింది. అతడిచ్చిన బట్టలను కాగితంలో పొట్లాంగా చుట్టి, "నేనివి తీసుకుని తిన్నగా పోలీసుస్టేషన్‌కి వెడితే?" అంది.

ప్రదీప్ నవ్వాడు, "పోలీసులు నన్నేమీ చేయలేరు. కోర్టులు నన్ను శిక్షించలేవు. కానీ నీ బ్రతుకు నాశనమవుతుంది. ఇప్పుడు నీ పరిస్థితి ఎలాగుందంటే – ఈ హత్యలో నా పేరు బయటకు రాకుండా కాపాడ్డం నీ బాధ్యత. ముమ్ముందు ఇంకా ఇంకా నేనిలాంటి హత్యలు చేసినా నువ్వు నాకు సహకరించి తీరగలవని నా నమ్మకం. గత్యంతరం లేదని బెంగపడకు. నేను నిన్ను నిజంగా ప్రేమిస్తున్నాను."

చంద్రిక, ఆమె స్నేహితురాలు, ఇప్పుడు తను...

ఇలా ఎంతమందో?

జలజకు రెండు చెవులున్నాయి. ఒక చెవిలో ప్రదీప్ హెచ్చరిక వినబడుతోంది. మరో చెవిలో "చెల్లాయ్!" అన్న చంద్రిక మాట వినబడుతోంది.

తను చేసిన హత్య ప్రదీప్‌పై ఏ ప్రభావమూ చూపలేదనుకుందుకు లేదు. చంద్రిక రాకకుముందు జలజ అతడి గాఢపరిష్వంగంలో వుంది. ఆ తర్వాత అతడా విషయమే మరిచాడు. జలజ కూడా మరిచింది.

ప్రదీప్ చెప్పిన ప్రకారం ఇద్దరూ అక్కణ్ణించి విడివిడిగా బయల్దేరారు.

ప్రదీప్ ఇంటికి వెళ్ళాడు.

జలజ దృఢనిశ్చయంతో పోలీస్ స్టేషన్‌కి వెళ్ళింది.

## 3

ఒకప్పుడు తనను నమ్మినవారిని ప్రదీప్ మోసగించాడు. ఇప్పుడతడు నమ్మిన వారందరూ అతణ్ణి మోసగించారు. వారిలో జలజతో పాటు పోలీసులూ, కోర్టులూ కూడా వున్నారు.

జలజ అన్నిచోట్లా నిజమే చెప్పింది. ఆమెకు బావ వ్రాసిన ఉత్తరముంది. ఆత్మహత్య చేసుకునేముందు పోస్టుచేసిన ఆమె ఉత్తరముంది. హంతకుడి దుస్తులు, శవం ఉనికి...

జలజ చెప్పకపోతే చంద్రిక హత్య కేసులో ప్రదీప్‌ని అనుమానించే అవకాశం కూడా వుండేదికాదేమో! కానీ ఇప్పుడతడికి తప్పించుకునే అవకాశం కూడా లేదు. ఆ కేసులో అతడామె శీలం మీద లేనిపోని అపవాదులు వేశాడు. డబ్బు కోసం తనను రెచ్చగొట్టి పచ్చిగా ప్రవర్తించి వశపర్చుకుందనీ అది చూసి భరించలేక అతడి ప్రియురాలు జలజను చంపబోయిందనీ తను జలజను రక్షించబోయి ప్రమాదవశాత్తూ చంద్రికను చంపాననీ అన్నాడు. జలజ తననెలా రెచ్చగొట్టిందీ కోర్టులో చాలా పచ్చిగా చెప్పాడతడు. అయితే తన శీలానికి సంబంధించి పవిత్రురాలినని పదే పదే నొక్కి చెప్పింది జలజ. క్రాస్ ఎగ్జామినేషన్లో ఆమె ఎక్కడా ఖంగారుపడలేదు.

ప్రదీప్‌కి యావజ్జీవ కారాగారశిక్ష పడింది. మహిళల చైతన్యానికి కొత్త మలుపు నిచ్చిన యువతిగా జలజను పత్రికలు ఆకాశానికెత్తేశాయి. అయితే కొన్ని పత్రికలు మాత్రం - ప్రదీప్ చెప్పిన మాటలన్నీ నిజం కాకపోయినా వారిద్దరికీ సంబంధముండి తీరాలని నిర్ధారించాయి. ఆమె శరీరానికి సంబంధించిన కొన్ని రహస్యాలనతడు యథాతథంగా చెప్పినట్లు ఆ ప్రతికలు భావించాయి.

చంద్రిక హత్య కేసు జలజ బావ త్రిమూర్తిపై కొంత ప్రభావాన్ని చూపించింది. అతడు జలజను పెళ్ళి చేసుకుంటాడా, చేసుకోడా అన్నది కుటుంబ సమస్య స్థాయినుంచి రాష్ట్రస్థాయికి పాకింది. అతడి నిర్ణయం పత్రికల్లో వస్తుంది.

త్రిమూర్తి జలజను కట్నం అడిగాడు. అది నేరం. ఆ నేరం ఉత్తరం రూపంలో కోర్టులో నమోదయింది. కొన్ని మహిళా సంస్థలు త్రిమూర్తిపై కేసు పెట్టాలనుకుంటున్నాయి. కానీ జలజ అతడిని పెళ్ళి చేసుకోవాలనే అనుకుంటోంది.

త్రిమూర్తికి జలజ అంటే ఇష్టమే! కట్నం లేకుండా ఆమెను పెళ్ళిచేసుకోవాల్సిన బాధ్యత కూడా అతడిపై పడింది. అయితే జలజకూ, ప్రదీప్‌కూ శారీరక సంబంధముందని - ప్రదీప్ అన్న మాటలే అతడు నమ్ముకున్నాడు. అది సూటిగా పైకి చెప్పలేక, "నువ్వు నిప్పులాంటిదానివని నాకు తెలుసు. కానీ రాముడంతటివాడు ప్రజాభిప్రాయానికి విలువనిచ్చి సీతకు అగ్నిపరీక్ష పెట్టాడు. ఆ తర్వాత అడవులకూ పంపాడు. నా కోసం కాకపోయినా నన్ను ప్రజలు హీనపర్చకుండా వుండడానికి నువ్వు కన్యాత్వపు పరీక్ష చేయించుకో" అన్నాడు జలజతో - జగన్నా[illegible]దుట!

ఈ మాటలు జలజ కంటే జగన్నాథాన్నెక్కువ ఆకర్షించాయి. తన కూతురి సాహసం కంటే, ఆమె మీద పడ్డ అపవాదే ఎక్కువగా ఆయన మనసులో వుండిపోయింది. తన కూతురు పరమ పవిత్రురాలు - అని లోకానికి ఋజువు కావాలని ఆయన కోరిక.

ఇటు తండ్రి, అటు కాబోయే భర్త...

ఇద్దరూ తమ తమ కారణాలవల్ల ఆమెను కన్యాత్వపు పరీక్షకు ప్రోత్సహిస్తూంటే - తన కారణంవల్ల జలజ పరీక్షకు భయపడుతోంది.

తన శీలం చెడిందో, లేదో ఆమెకు తెలియదు. కానీ తొలిసారిగా ఒక పురుషుడామెకంతవరకూ ఎవరూ రానంత దగ్గరగా వచ్చాడు. శీలమంటే ఏమిటో అది సరిగ్గా ఎప్పుడు పోతుందో తెలియదుకానీ తానిప్పుడు కన్యాత్వపు పరీక్షలో నెగ్గగలన్న నమ్మకం ఆమెకు లేదు.

అందుకే మేకపోతు గాంభీర్యంతో, "నేను పరీక్షలో నెగ్గి తీరుతాను. కానీ పెళ్ళికి ముందు నన్ననుమానించావని జీవితాంతం గుర్తుండిపోతుంది. నీకు నా శీలం ముఖ్యమా, శీలపరీక్ష ముఖ్యమా?" అంది త్రిమూర్తితో.

త్రిమూర్తి అసహాయుడి నవ్వట్లు నవ్వాడు. ఆ నవ్వులోంచీ ఆమెకు డాక్టర్ మృత్యుంజయ్ మాటలు వినిపించాయి, "నీ కన్యాత్వం భంగంకాకుండా నా కోరిక తీర్చుకోగలను. నువ్వు అనుమతించాలి. అంతే!"

ఆ మాటల్లో ఆమెకు కర్తవ్యం బోధపడింది. ఆ సాయంత్రం ఆమె డాక్టర్ మృత్యుంజయ్‌ని కలుసుకుంది. తన సమస్యను చెప్పకుంది.

"పరీక్ష నా అసిస్టెంట్ మృణాళిని చేస్తుంది. రిపోర్టు నేనిస్తాను. నీ కన్యత్వానికి హామీ నాది. నీవు అనుమతించాలి. అంతే!" అన్నాడు మృత్యుంజయ్.

అప్పుడు జలజకు కలిగిన ఉత్సాహమింతా అంతా కాదు.

బిడ్డ తల్లి అయిన కుంతీదేవిని కన్యాత్వం భంగం కాని కుంతీ కుమారిగా పురాణాలు చెబుతూంటే అవుననే మన సంప్రదాయం - డాక్టరు రిపోర్టులో కన్యాత్వాన్ని నమ్మదా?

తండ్రి, బావ - ఇద్దరి మనసులొక్కసారిగా శాంతిస్తాయి. కొన్ని పత్రికల నోళ్ళు శాశ్వతంగా మూతబడతాయి.

శీలంకంటె శీల పరీక్షకు ప్రాధాన్యతనిచ్చే త్రిమూర్తికిందులో తను చేసే అన్యాయమేమీ లేదు.

ఈసారి తన శీలం చెడిందో లేదో జలజకు సంబంధం లేదు. డాక్టర్ మృత్యుంజయ్ ప్రదీప్‌కంటే, అంతకంటే మరే పురుషుడూ రాలేనంతగానూ - ఆమెకు దగ్గరయ్యాడు. అయితేనేం తన కన్యాత్వం భంగం కాలేదని అయినవాళ్ళకూ, లోకులకూ ఆమె ఋజువు చేసుకుంది.

## ఎవరో కాదు—ఒక కవి!



కాగితాలపై కదిలే అక్షరాల్లో
నిలదీసే ఆ రక్తధార ఎవరిది?
రాగద్వేషాల కతీతంగా
పల్కరించే స్వేచ్ఛాసురక్తి కోసం
జీవితం సాంతం సిరల్లో
పరుగులు పెట్టే జీవనవాంఛ!

కొత్త రూపాయి నోట్ల రెపరెపల్లో
అంతిమ సారాన్ని అదిమిపట్టాలనే చేతులకు
ఆ అక్షరాల వేడిశ్వాస అసలే తగలదు.

అడుగడుగునా ప్రశ్నించే పదాల్లో
ప్రవహించే ఆలోచనల
అంతిమ గమ్యం దగ్గర,
తోచిన సమాధానాల కాలం నావపై
ఆ అక్షర శిల్పి కూచుని వుంటాడు,
సమస్యల తీరాన్ని దాటించే
నిరంతర యత్నంలో
జీవనదిలో మనిషిదరి కోసం
అక్షరాల అక్షయ పాత్రతో
క్షణక్షణం క్షీణించే ఆ ప్రాణి-
ఎవరో కాదు - ఒక కవి
కాగితాలపై జ్వలించే నెత్తుటిలో
యుగాంతాలదాకా శ్వాసించే మనిషి!

- నిఖిలేశ్వర్